అంశం: 27

# నీటి వనరులను సంరక్షించుకుందాం

**లక్ష్యం:**

1. నీటి సంరక్షణ విధానాల గురించి తెలుసుకుందాం.
2. వర్షపు నీటిని పరిరక్షించాల్సిన ఆవశ్యకతను గుర్తిద్దాం.





**నేపథ్యం:**

వర్షం సహజమైన, అతిముఖ్యమైన నీటివనరు. బావులు, కాలువలు, చెరువులు, సముద్రాలు అన్నింటికి ఆధారం వర్షమే. వర్షం లేకుంటే అనావృష్టి. ఎక్కువైతే అతివృష్టి. వర్షాకాలంలోని వర్షపునీరే సంవత్సరమంతటికి ఆధారం. ఇటువంటి అమూల్యమైన వర్షం వచ్చినపుడు భూగర్భజలాలుగా ఇంకుతున్నది కొద్ది మాత్రమే. ప్రవాహాలుగా సముద్రాలలో కలిసిపోయేదే ఎక్కువ. పెరుగుతున్న జనాభాకు తోడుగా భూగర్భ జలాల అవసరం కూడా రోజురోజుకూ పెరిగిపోతూ ఉంది. కనుకనే వర్షపునీరును సంరక్షించుకొని, భూగర్భజలాలుగా మార్చుకోవడం అత్యావశ్యకం. వర్షాకాలంలో వర్షపునీటిని పెద్ద పెద్ద ట్యాంకులు, రిజర్వాయర్‌లు, ఇంకుడు గుంతలు, చెరువుల్లో నిల్వచేసి, నేరుగా లేదా భూగర్భ జలాలుగా గాని అవసరం మేరకు వినియోగించుకోవచ్చు. దీనినే నీటి సంరక్షణ అంటున్నాం. పెరట్లో, వాకిట్లో, ఇంటిచుట్టూ బండలు వేసుకోవడం, చెట్లు పెంచకపోవడం, అడవుల నరికివేత మొదలైన అనేక కార్యకలాపాలతో నీరు సహజంగా భూమిలో ఇంకకుండా చేస్తున్నది మనమే. ఇంటింట బోరువేసి అవసరానికి మించి వాడుతూ, అనవసరంగా వృథా చేస్తూ నీటికోసం అంగలారుస్తున్నది మనమే! ప్రస్తుతం అనేక నీటి సంరక్షణా పద్ధతులు కనుక్కోబడ్డాయి. వాటి గురించి తెలుసుకొని తగిన పద్ధతినెంచుకొని విధిగా పాటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

**పద్ధతి:**

1. వర్షపు నీటి సంరక్షణ పద్ధతుల గురించి పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్స్, ఇంటర్‌నెట్ నుండి కావాల్సిన సమాచారాన్ని, చిత్రాలను సేకరించండి.

2. మీ స్థానిక పరిసరాల్లోని ఏదేని వర్షపునీటి సంరక్షణా విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, కింది ప్రశ్నలతో కావాల్సిన సమాచారాన్ని సేకరించండి.

- వర్షపు నీటిని ఏ విధంగా సంరక్షిస్తున్నారు?
- ఎన్ని సంవత్సరాల నుండి ఈ విధంగా చేస్తున్నారు?
- ఈ ప్రత్యేకమైన ఏర్పాటుకోసం ఎంత ఖర్చుచేసారు?
- ఇందుకవసరమైన సామగ్రిని ఎక్కడ కొనుగోలు చేసారు?
- ఒక సంవత్సరంలో ఎంత నీటిని సంరక్షించగలిగారు?
- నిల్వచేసిన నీటిని ఏవిధంగా ఉపయోగిస్తుంటారు?
- ఈ విధానాన్ని అనుసరించబోయే వారికి మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

**ముగింపు:**

నీటి వనరులను కాపాడుకోడం అంటే నీటిని పొదుపుగా వాడడం. నీరు కారిపోతున్న నల్లాలను ఎప్పటికప్పుడు బాగు చేయించుకోడం. చెరువుల్లోకి నీరు వెళ్ళే కాలువలు, డొంకలు కూడిపోకుండా చూడడం అని గుర్తించాలి. వాన నీటిని నిల్వచేసుకోడానికి, భూగర్భ జలాలను పెంచుకోడానికి అవసరమైన చర్యలు పాటించడం ద్వారా మనం మన నీటి వనరులను కాపాడుకోగలం. ప్రతి ఇంటిలో, వీధిలో, పాఠశాలలో, కార్యాలయంలో, బస్టాండుల్లో ఇలా వీలైన చోటల్లా ఇంకుడు గుంటలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి వాన చినుకును పొదిగి పట్టుకుని పదిలంగా దాచుకోవాలి. భూగర్భ జలాలను పెంచుకోవాలి. కొళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిని పొదుపుగా వాడుకునే కుటుంబాలకు పారితోషకాలు ఇవ్వాలి. ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కలిగించాలి.

మీరు సేకరించిన సమాచారంతో ఒక నివేదికను తయారుచేసి ప్రదర్శించండి.

**తదుపరి చర్యలు:**

1. వర్షపునీటి సంరక్షణ, ఆవశ్యకత, విధానాలను గురించి అందరికి తెలియజేయడానికి పోస్టర్ తయారుచేయండి.కాపాడుకోకపోతే భవిష్యత్‌లో కలగబోయే అనర్థాలను గురించి చర్చించండి.

2. మీ ఇంటిలో, పాఠశాలలోనూ తగిన నీటిసంరక్షణ విధానాన్ని ఎన్నుకొని అమలు చేయండి.

3. మీ ప్రభావంతో ఎంతమంది నీటిని సంరక్షించడానికి పూనుకొన్నారో, ఆచరిస్తున్నారో వారి వివరాలను, ఫొటోలతో సహా రిపోర్ట్‌లో పొందుపరచండి. ప్రార్థనా సమావేశంలోను, గోడపత్రికలోనూ రిపోర్టును ప్రదర్శించండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ